క్లుప్తంగా

శ్మశాన వాటికకు హద్దులు చూపండి


దీటీకి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గార్లదిన్నె: మండలంలోని మర్తాడులో శ్మశాన వాటిక ఆక్రమణకు గురి కాకుండా హద్దులు చూపించాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎల్లారెడ్డి, శింగనమల నియోజకవర్గ ఆర్టీఐ విభాగం అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. సోమవారం వారు మాట్లాడుతూ గ్రామంలో ఎస్సీల శ్మశాన వాటికకు హద్దులు లేక పోవడంతో ఆక్రమణకు గురయ్యే అవకాశం ఉందన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి శ్మశాన వాటిక స్థలం సర్వే చేసి హద్దులు చూపించాలన్నారు. అలాగే కల్లూరులో ఈ నెల 7న రాత్రి రెవెన్యూ అధికారులపై దాడి చేసిన టీడీపీ మట్టి మాఫియాపై పరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అధికారులపై దాడులు చేసిన వారిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించాలన్నారు. భవిష్యత్తులో అధికారులపై దాడులు జరుగకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

హామీలు నెరవేర్చాలి

పెద్దపప్పూరు: కూటమి ప్రభుత్వం ఎన్నిక ప్రచారంలో భాగంగా రజకులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సోమవారం మండల కేంద్రంలో సీపీఐ, రజక సంఘం నేతలు ర్యాలీ నిర్వహించి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏపీ రజక వృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య, సీపీఐ మండల కార్యదర్శి చింతా పురుషోత్తం మాట్లాడుతూ దోభీఘాట్ మోటార్లకు, రజకులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తింపజేయాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన రజకులకు పింఛన్ మంజూరుచేయాలని వారు డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు నాగప్ప, తాడిపత్రి పట్టణ అధ్యక్షుడు సూరి, మండల అధ్యక్షుడు గుర్రప్ప, కమిటీ సభ్యులు పుల్లన్న, సురేష్,మూర్తి, రంగనాథ, లక్ష్మీనారాయణ, రామాంజనేయులు, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

'ఎన్నికల కమిషన్ కేంద్రానికి తొత్తుగా మారింది'


తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

గుంతకల్లు రూరల్: కేంద్ర ప్రభుత్వానికి తొత్తుగా మారిన ఎన్నికల కమిషన్‌ను వెంటనే ప్రక్షాళన చేయాలని డిమాండ్ చేస్తూ సీపీఎం నాయకులు సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బీ.శ్రీనివాసులు, నాయకుడు మారుతీప్రసాద్ మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో బిహార్ రాష్ట్రంలో ఏకంగా 15 లక్షల మంది ఓట్లను తొలగించారన్నారు. ఇంతటి దారుణానికి కేంద్ర ఎన్నికల సంఘం ఒడి గట్టడం దారుణమన్నారు. వలసల పేరుతో మైనార్టీలు, బలహీన వర్గాలు, పేదల ఓట్లను భారీ ఎత్తున తొలగించారన్నారు. అప్రజాస్వామికంగా బీజేపీ ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను వెంటనే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ప్రతిభ


విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం, పీడీలు

గుంతకల్లుటౌన్: కర్ణాటక రాష్ట్రం చిక్‌బళ్లాపూర్ జిల్లా గౌరీబిదనూర్‌లో రెండు రోజుల పాటు జరిగిన ఆలిండియా ఓపెన్ కరాటే చాపియన్‌షిప్ పోటీల్లో ఎస్‌జేపీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కె.నాగేశ్వరి, కె.ఇందూ ప్రతిభ కనబరిచి ద్వితీయస్థానంలో నిలిచారు. ఈ సందర్భంగా సోమవారం పాఠశాలలో విద్యార్థినులను ఇన్‌చార్జ్ హెచ్‌ఎం గోపాల్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్లు జ్యోతి, రాజేష్ జ్ఞాపికలు, ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

పెన్నానదికి జలహారతి


హారతి ఇస్తున్న అర్చకులు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని పార్వతీ సమేత బుగ్గ రామలింగేశ్వరస్వామి దేవాలయం వద్ద సోమవారం సాయంత్రం పెన్నానదికి అర్చకులు జలహారతి ఇచ్చారు. శ్రావణ మాసం మూడో సోమవారం పెన్నానదికి నీరు రావడంతో అర్చకులు వేద మంత్రోచ్చారణల నడుమ హారతిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై హారతిని వీక్షించారు.


తాడిపత్రి: చెరువును తలపిస్తున్న బీసీ బాలికల వసతిగృహం


గుంతకల్లు: రాజేంద్రనగర్ వేంకటేశ్వర స్వామి గుడికి వెళ్లే మార్గంలో మురుగు నీరు నిల్వ ఉన్న దృశ్యం


యాడికి: మార్కెట్‌కు వెళ్లే రహదారిపై నిలిచిన వర్షపు నీరు

ముందుకు కదలని మురుగు

- పేరుకుపోయిన అపరిశుభ్రత
- విజృంభిస్తున్న దోమలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

పారిశుధ్యం పడకేసింది. కొద్దిపాటి వర్షానికే వీధులన్నీ బురదమయంగా మారుతున్నాయి. దీనికితోడు మురుగునీరు రోడ్లపై పారుతోంది. చెత్తాచెదారం గుట్టలుగా పేరుకుపోయింది. దీంతో పల్లెల్లో ఎటుచూసినా అపరిశుభ్రత నెలకొంది. అధికారులు, నాయకులు సమస్యలు పట్టించుకోవడంలేదని ప్రజలు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం కొలువైన తర్వాత అధికారుల పర్యవేక్షణ కొరవడి ఎక్కడ చూసినా అపరిశుభ్రత నెలకొంది దోమలు విజృంభించి ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.. పారిశుధ్యం మెరుగుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

సాక్షి గ్రౌండ్ రిపోర్ట్

గుంతకల్లు: స్థానిక రాజేంద్రనగర్‌లోని వేంకటేశ్వర స్వామి గుడి వెళ్లే రహదారిపై నిత్యం మురుగు నిల్వలతో ప్రజలు బేజారువుతున్నారు. ఈ మార్గంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం, ఎక్సైజ్, టూటౌన్ పోలీసుస్టేషన్‌లుతోపాటు శ్రీ చైతన్య పాఠశాలలు ఉన్నాయి. లోతట్టుగా ఈ మార్గం ఉండటంతో చిన్నపాటి వర్షం వచ్చినా మురుగు నీరు నిల్వ ఉంటోంది. దీంతో వెంకటేశ్వరస్వామి గుడికి వెళ్లే భక్తులు, సబ్ రిజిస్టర్ కార్యాలయం వచ్చే ప్రజలు, పాఠశాలకు వెళ్లే విద్యార్థులు మురుగు నీరు మీదుగా వెళ్లాల్సిన దుస్థితి. అంతేకాకుండా మురుగునీటి నిల్వల వల్ల దోమలు ప్రబలుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు.

చిత్తడిగా రైల్వేగేట్ రోడ్లు

గుంతకల్లుటౌన్: పట్టణంలో చిన్నపాటి వర్షం కురిసినా నిత్యం రద్దీగా ఉండే ధర్మవరం రైల్వేగేట్‌రోడ్డు, మండీబజార్ వాటర్ ట్యాంక్ రోడ్లు చిత్తడిచిత్తడిగా మారుతున్నాయి. రోడ్లు బురదమయంగా మారుతుండటంతో వాహనదారులు, పాదచారులు చాలా ఇబ్బందులు పడుతున్నారు. రైల్వే గేట్ వేసినప్పుడల్లా వందల సంఖ్యలో ద్విచక్రవాహనాలు, ఇతర వాహనాలు గత్యంతరం లేక అదే బురదరోడ్లపైనే ప్రయాణం సాగించాల్సి ఉంది. గుంతలు లేని రహదారులను తీర్చిదిద్దు తామని బాకాలు ఊదిన కూటమి పాలకులు రోడ్లకు మరమ్మత్తులు చేయకపోవడంతో ఎప్పుడెలాంటి ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

గుత్తి: మున్సిపాలిటీ పరిధిలో అపరిశుభ్రత తాండవిస్తోంది. చెత్త కుండీలు సక్రమంగా లేవు. డ్రైనేజీ కాలువలను రెగ్యులర్‌గా శుభ్రం చేయడం లేదు. దీంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు వాపోతున్నారు.

మార్కెట్‌కు వెళ్లాలంటే వర్షపు నీటిలో నడవాల్సిందే

యాడికి: ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వర్షపు నీరు మార్కెట్‌కు పోయే రహదారిలోని గుంతల్లో ఎక్కువగా నిలిచాయి. దీంతో సంతకు వచ్చిన ప్రజలు వర్షపునీటిలో నడుస్తూ జారి కిందపడుతున్నారు. కొందరు వెనక్కు వెళ్లి కోమటి బజార్ గుండా మార్కెట్‌కు పోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి మార్కెట్‌కు పోయే రహదారిలో వర్షపు నీరు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

అపరిశుభ్రత తాండవం

పెద్దవడుగూరు: మండలంలోని గుత్తిఅనంతపురం, లక్ష్మంపల్లి, పెద్దవడుగూరు, రావులుడికి, చిత్రచేడు తదితర గ్రామాల్లో అపరిశుభ్రత తాండవం చేస్తోంది.


పెద్దవడుగూరు: లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాలకు మురుగు నీటిలో వెళ్తున్న విద్యార్థి

లక్ష్మంపల్లి జెడ్పీ పాఠశాల మెయిన్ గేట్ వద్ద వర్షం నీరు నిలిచి ఉండటం తో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం నీరు నిల్వ ఉండడంతో దుర్వాసన వస్తోందని విద్యార్థులు వాపోతున్నారు అధికారులు స్పందించి మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

పడకేసిన పారిశుధ్యం

పామిడి: పామిడిలో పారిశుధ్యం పడకేసింది. సాగు నీటి కాలువలైన గంగిరెడ్డి కాలువ, పెద్దకాలువ, పశువుల ఆస్పత్రి గుండా వెళ్లే పెన్నానది పిల్లకాలువ, బీసీ కాలనీగుండా వెళ్లే పులుసు కాలువ మురికి కాలువలుగా మారాయి. దీంతో ఆయా కాలనీవాసులకు సీజనల్‌వ్యాధుల బెడద తప్పడం లేదు. పాలకులు, అధికారులు స్పందించి పామిడిలో డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.


గుంతకల్లు రూరల్: వైటీ చెరువు గ్రామంలో రోడ్డుపై పేరుకుపోయిన మురుగు


పామిడి: మురికి కాలువగా మారిన సాగునీటి పెద్దకాలువ


పెద్దపప్పూరు: గార్లదిన్నె ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపు నీరు


గుంతకల్లుటౌన్: డీఎంఎం రైల్వే గేట్ వద్ద రోడ్డు మధ్యలో గుంతలో నిలిచిన వర్షపునీరు


గుత్తి: ఓల్డ్ సీపీఐ కాలనీలో పేరుకుపోయిన చెత్త

దోమల బెడద

గుంతకల్లు రూరల్: మండలంలోని వైటీ చెరువు, నరసాపురం గ్రామంల్లో పారిశుధ్యం అధ్వానంగా మారింది. నరసాపురంలో అసలు డ్రైనేజీ వ్యవస్థే లేకపోవడం, వైటీ చెరువులో అక్కడక్కడ డ్రైనేజీలు ఉన్న వాటిని సక్రమంగా నిర్వహించకపోవడంతో మురుగు రోడ్లపైకి ప్రవహిస్తుంది. దీంతో దోమల బెడద పెరిగి,, తరచూ జ్వరాల భారిన పడుతున్నారని ప్రజలు వాపోతున్నారు.

బీసీ హాస్టల్ విద్యార్థులకు అవస్థలు

తాడిపత్రిటౌన్: పట్టణంలోని టైలర్స్ కాలనీలో ఉన్న బీసీ బాలికల వసతిగృహాన్ని వర్షం నీరు ముంచేయడంతో విద్యార్థినులకు అవస్థలు తప్పడం లేదు. దాదాపు 300 మంది విద్యార్థులున్న ఈ వసతి గృహం చుట్టూ వర్షపు నీరు చేరి చెరువును తలపిస్తోంది. మురుగు కారణంగా దోమల వ్యాప్తి ఎక్కువగా ఉందని, మరుగుదొడ్లకు వెళ్ళేందుకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థినులు వాపోతున్నారు. అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

నివాసాల నడుమ మురుగు

పెద్దపప్పూరు: గత నాలుగురోజులుగా కురుస్తున్న మండలంలని గార్లదిన్నె ఎస్సీ కాలనీతో పాటు, పెద్దపప్పూరులోని చిన్నఅశిత్తయ్య ఆశ్రమం వద్ద వర్షపు నీరు నిల్వడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పంచాయితీ అధికారులు వర్షపు నీరు నిల్వ ఉన్న చోట బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లకపోవడంతో దోమల కారణంగా విషజ్వరాలకు గురి కావాల్సి వస్తుందేమోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

మోసానికి నిదర్శనం చంద్రబాబు


చంద్రబాబు మోసాలను ప్రజలకు వివరిస్తున్న సమన్వయకర్త శైలజానాథ్, కేతిరెడ్డి పెద్దారెడ్డి, గిరిజమ్మ

గార్లదిన్నె(శింగనమల): మోసానికి నిలువెత్తు నిదర్శనం ముఖ్యమంత్రి చంద్రబాబు. ఎన్నికల సమయంలో ఆయన ప్రజలకు ఇచ్చిన హామీలు అమలుచేయడంలో విఫలమయ్యారంటూ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ శైలజానాథ్ మండిపడ్డారు. సోమవారం సాయంత్రం శింగనమల మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పూల ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీకాలింగ్ చంద్ర బాబు మేనిఫెస్టో కార్యక్రమానికి శైలజానాథ్‌తోపాటు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి వారు ఇంటింటికి వెళ్లి చంద్రబాబు మోసాలను క్యూఆర్ కోడ్ ద్వారా స్కాన్ చేసి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా శైలజానాథ్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల్లో ఒక్కటీ అమలు చేయకుండా అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. చంద్రబాబుది సుపరిపాలన కాదని, స్వపరి పాలన అని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో మద్యం, ఇసుక, మట్టి దౌర్జన్యం తప్ప ఏమీ కనిపించలేదన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమన్నారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి మాట్లాడుతూ ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలతో పాటు అమలు కానీ 143 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారన్నారు. తల్లికి వందనం పథకంలో కూడా కొంత మంది తల్లులకు మాత్రమే డబ్బులు చెల్లించారన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చి సంవత్సరం దాటినా ఎన్నికల హామీలు అమలు చేయలేదన్నారు. ఆడ బిడ్డ పథకం అమలు చేయాలంటే రాష్ట్రం అమ్మాలని కూటమి నాయకులు మాట్లాడడం మహిళలను అవమానించడమేనన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ మాజీ సమన్వయ కర్త వీరాంజనేయులు, ఎంపీపీ యోగేశ్వరీ, సీనియర్ నాయకులు బొమ్మన శ్రీరామరెడ్డి, నార్పల సత్యనారాయణ రెడ్డి, వంశీ గోకుల్‌రెడ్డి, తరిమెల భాస్కర్‌రెడ్డి, నాయకులు , సర్పంచులు, ఎంపీటీసీలు,వివిధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలంలోని తిమ్మాపురం, తక్కలపల్లి, గాండ్లపాడు గ్రామాల్లో రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చంద్రబాబు మోసాలను వివరించారు.

యాడికి: చంద్రబాబు అంటేనే మోసమని, ఓట్ల కోసం ప్రజలను నమ్మించి నట్టేట ముంచే రకమని, ఇంటింటికీ ఆయన మోసాలనుతీసుకెళదామని సర్పంచు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సంజీవ రాయుడు అన్నారు. మండలంలోని తూట్రాళ్లపల్లిలో తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు రామకృష్ణారెడ్డి, కేశవ రెడ్డి, రామ మనోహర్ రెడ్డి, సుబ్బయ్య, ముత్యాల రెడ్డి, నాగేశ్వర రెడ్డి, శ్రీనివాస రెడ్డి, లక్ష్మీనారాయణ, పెద్దరామన్న, నారాయణ రెడ్డి, రామాంజనేయులు, వెంకటేస్, శేఖర్, గురప్ప, తిరుపాలు పాల్గొన్నారు.


యాడికి మండలం తూట్రాళ్లపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న మండల కన్వీనర్ సంజీవరాయుడు


పుట్లూరు మండలంలో రీకాలింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

గొడవలు ప్రేరేపించే వారిపై చర్యలు తీసుకోవాలి

పెద్దవడుగూరు: మండలంలోని చిట్టూరుకు చెందిన మహిళా రైతు బాలాంజినమ్మతో పొలం తగాదా పెట్టుకుని గొడవలకు ప్రేరేపించే కొత్తకోట శ్రీరాములుపై చర్యలు తీసుకోవాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు కత్తుల కొండయ్య కోరారు. సోమవారం స్థానిక ప్రెస్‌క్లబ్ ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బాలాంజినమ్మకు సర్వే నెంబర్ 519, 520–ఏ– లో 2.61 ఎకరాల పొలం ఉందన్నారు. వర్షం వచ్చినప్పుడు వర్షపు నీరు ఆమె పొలం మీదుగా దిగువకు వెళ్లేవన్నారు. పక్క పొలంలో ఉన్న కొత్తకోట శ్రీరాములు తన పొలంలోకి వర్షం నీరు వెరాకుండా అడ్డుగా మట్టిని తోలి మహిళా రైతును తీవ్రంగా నష్ట పెడుతున్నాడన్నారు. ఆయనపై చర్యలు తీసుకొని ఆమె న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం బాధితురాలికి న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ ఉషారాణికి వినతిపత్రం అందజేశారు. మండల నాయకుడు గూడూరు రంగస్వామి, బాధితురాలి భర్త లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాతీయస్థాయి సదస్సు జయప్రదం చేయండి

గుంతకల్లు: పట్టణంలోని శంకరనంద గిరి స్వామి డిగ్రీ కళాశాలలో సెప్టెంబర్ 25, 26న జరిగే జాతీయస్థాయి సదస్సు విజయవంతం చేయాలని కరస్పాండెంట్ కేపీ హరి కోరారు. సోమవారం కళాశాలలో విద్యార్థులతో కలిసి జాతీయ స్థాయి సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఇన్నోవేషన్ ఇన్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ అండ్ మిషన్ లెర్నింగ్ ట్రెండ్స్, చాలెంజెస్ అండ్ ఆపర్చునిటీస్ అనే విషయమై జాతీయ స్థాయి సదస్సు నిర్వహిస్తామన్నారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.సురేష్‌బాబు, సైన్స్ విభాగం అధిపతి డాక్టర్ నటరాజ్, కంప్యూటర్ సైన్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'గుంతకల్లు కేంద్రంగా జిల్లా ఏర్పాటు చేయాలి'

గుత్తి రూరల్: గుంతకల్లు కేంద్రంగా కొత్త జిల్లాను ఏర్పాటు చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కొత్తపేట గ్రామంలో సోమవారం ఐటీ వింగ్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కొత్త జిల్లాలను ఏర్పాటు చేయాలని భావిస్తోందని, గుంతకల్లును జిల్లాగా ప్రకటిస్తే అందరికీ అనుకూలంగా ఉంటుందన్నారు. గుంతకల్లు అతి పెద్ద రైల్వే డివిజన్‌గా ఉందని జిల్లా చేస్తే వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. కార్యక్రమంలో ఐటీ వింగ్ నాయకులు హరిప్రసాద్, రాంబాబు, సాయిరెడ్డి, అనిల్ పాల్గొన్నారు.

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యువల్ చేయాలి

గార్లదిన్నె: కేంద్ర ప్రభుత్వం ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యువల్ చేయాలని ఆర్డీటీ అభిమాన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీటీ మహిళ సంఘం సభ్యులు, ఆర్డీటీ లబ్దిదారులు బస్టాండ్ సర్కిల్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రంను డిప్యూటీ తహసీల్దార్ మల్లికార్జునకు అందజేశారు. కార్యక్రమంలో కదిరెప్ప, ఓబులపతి, పుల్లన్న, నాగేంద్ర, ఓబిలేసు, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పెద్దపప్పూరులో ర్యాలీ

పెద్దపప్పూరు: ఆర్డీటీకి కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ పునరుద్ధరించాలని కోరుతూ సోమవారం మండల కేంద్రంలో ఆ సంస్థ అభిమానులు ర్యాలీ నర్వహించి తహసీల్దార్ బాలాజీరావుకు వినతి పత్రం అందజేశారు. టి.ఆదినారాయణ, పలు గ్రామాలకు చెందిన మహిళలు పాల్గొన్నారు.

నులి పురుగులతో చిన్నారుల్లో రక్తహీనత

గార్లదిన్నె: చిన్నారుల కడుపులో నులి పురుగులు వల్ల రక్తహీనత ఏర్పడుతుందని గార్లదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ఉదయ్ అన్నారు. సోమవారం నులిపురుగుల నివారణ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను వైద్య సిబ్బంది విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ మండలవ్యాప్తంగా 1 – 19 ఏళ్ల లోపు పిల్లలందరికీ మంగళవారం నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నాగేశ్వరరావు, సీహెచ్‌ఓ లోక్‌నాథ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మిషన్ తగిలి యువకుడికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని కొత్తపేట గ్రామ శివారులో ఓ ఇటుకల తయారీ కేంద్రంలో సోమవారం ప్రమాదవశాత్తు మిషన్ తగిలి శేఖర్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు.. జక్కలచెరువు గ్రామానికి చెందిన శేఖర్ కొత్తపేట గ్రామ శివారులో ఇటుకల ఫ్యాక్టరీలో పని చేసేవాడు. ఈ క్రమంలో ఫ్యాక్టరీలో పని చేస్తున్న సమయంలో శేఖర్ కుడి చేతికి మిషన్ తగిలి తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన ఫ్యాక్టరీ యజమాని వెంటనే అతడిని గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

మట్కా బీటర్ల అరెస్టు

గుత్తి: పట్టణంలోని అమృత్ సినిమా వెనుక ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి ఎస్ఐ సురేష్ ఆధ్వర్యంలో పోలీసులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా మట్కా రాస్తున్న కంబగిరి, ఆంజనేయులును అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 12,150 నగదును స్వాధీనం చేసుకున్నారు.

బేకరీ దుకాణం దగ్ధం

బుక్కరాయసముద్రం: మండల కేంద్రంలోని నార్పల క్రాసింగ్ వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో సోమవారం తెల్లవారుజామున బేకరీ షాపు దగ్ధమైన సంఘటన చోటు చేసుకుంది. ఘటనలో రూ. 30 లక్షల వరకూ నష్టం వాటిల్లినట్లు బాధితుడు శంకర్ మోరీ వాపోయాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సీపీఐ మండల కమిటీ ఏకగ్రీవం

గుంతకల్లు రూరల్: స్థానిక సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, నియోజకవర్గవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి, సహాయ కార్యదర్శి మహేష్ ఆధ్వర్యంలో మండల కమిటీని ఎన్నుకున్నారు. గతంలో ఉన్న కమిటీనే రెండోసారి కొనసాగిస్తూ తీర్మానం చేశారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శిగా ఎన్నికైన రాము, సహాయ కార్యదర్శిగా ఎన్నికైన పి.రామాంజనేయులును అభినందిస్తూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.

వైభవంగా తిమ్మప్ప స్వామి కల్యాణం

గుత్తి రూరల్: మండలంలోని బసినేపల్లి శివారులోని గద్దెరాళ్ల కొండపై వెలసిన ఆలయంలో సోమవారం తిమ్మప్పస్వామి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకుడు సు. దీంద్రనాథ్ ఆలయంలో శ్రీదేవి, భూదేవి సమేత తిమ్మప్ప స్వామిని ప్రత్యేకంగా అలంకరించి దివ్య కల్యాణం జరిపించారు. అనంతరం స్వామికి విశేష అభిషేకాలు, లక్ష్మీనారాయణ హోమం, పల్లకీ సేవ, వసంతోత్సవం, దీపాలంకరణ సేవ, నామ సంకీర్తన, ఊయల సేవ, పవలింపు సేవలను ఘనంగా నిర్వహించారు. భక్తులు అశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనంరతం అన్నదానం ఏర్పాటు చేశారు.


కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

సాయంత్రం స్వామి వారి ఉత్సవ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు. అనంతరం ఆలయ ఆవరణలో రాత్రి ప్రదర్శించిన పౌరాణిక నాటకాలు ఆకట్టుకున్నాయి.

ఆలయ కమిటీ నియామకానికి దరఖాస్తు చేసుకోండి

పెద్దపప్పూరు: మండలంలోని అశ్వత్థ నారాయణ స్వామి క్షేత్ర నూతన ధర్మకర్తల మండలి నియామకానికి ఆసక్తి ఉన్నవారు దరఖాస్తు చేసుకోవచ్చని సోమవారం ఈఓ సుబ్రమణ్యం ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల 25లోపు వచ్చిన దరఖాస్తులను జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. అశ్వత్థంలోని కార్యాలయంలో దరఖాస్తులను అందుబాటులో ఉంచామన్నారు.

గుత్తి ఎస్ఐగా నాగప్ప

గుత్తి: గుత్తి ఎస్ఐగా నాగప్ప సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న ఆశాబేగం కర్నూలుకు బదిలీ అయ్యారు. గుత్తి జీఆర్‌పీ ఎస్ఐగా పనిచేస్తున్న నాగప్పను ఇటీవల అనంతపురం బదిలీ చేశారు. అక్కడ నుంచి నాగప్పను ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన నాగప్ప.. సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.నాగప్పకు వారు శుభాకాంక్షలు తెలిపారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ


గుంతకల్లులో ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్

గుంతకల్లుటౌన్: స్వాతంత్ర్య వేడుకల్లో భాగంగా పట్టణంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ ఘనంగా నిర్వహించారు. ర్యాలీని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ జాతీయ జెండాను ఊపి ప్రారంభించారు. భారత జాతీయ పతాకాన్ని చేత పట్టుకుని మున్సిపల్ ఉద్యోగులు, సిబ్బంది, డ్వాక్రా మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమర యోధుల కుటుంబాలకు సన్మానం

గుత్తి: గుత్తిలో సోమవారం మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో స్వాతంత్ర్య సమరయోధ కుటుంబ సభ్యులైన సూర్యనారాయణ రెడ్డి, రామ్మోహన్‌ను సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్‌బీ, గుత్తి కోట సంరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు చౌదరి విజయ భాస్కర్, మున్సిపల్ మేనేజర్ రాంబాబు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా, సచివాలయాల అడ్మిన్లు పాల్గొన్నారు.

రేపు గుంతకల్లులో ర్యాలీ

గుంతకల్లుటౌన్: బీజేపీ ఆధ్వర్యంలో ఈ నెల 13న హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించనున్నట్లు ఈ కార్యక్రమ నియోజకవర్గం ఇన్‌చార్జ్ అంకాల్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఇల్లూరుభవన్‌లో జరిగిన బీజేపీ నాయకుల సమావేశంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహణపై చర్చించారు. బుధవారం ఉదయం 10 గంటలకు రైల్వేగ్రౌండ్ నుంచి నిర్వహించే ర్యాలీలో అందరూ పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కొలిమి రామాంజి, విశ్వనాథ్, పురంధర్, శ్రీదేవి, రవిబాబు, హరినాథ్, శేకన్న పాల్గొన్నారు.